క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం



అలంపూర్: విద్య సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతామని బీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు అన్నారు. మండలంలో బీసీటీఏ బలపర్చిన హైదరాబాదు-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయ్ కుమార్ మద్దతుగా మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని సోమవారం ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులతో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధిక సంఖ్యలో తరలిరావాలి

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వెనుక లక్ష్మీవెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఉదయం 11గంటలకు సేవాలాల్ మహరాజ్ జయంతి ముగింపు వేడుకలను నిర్వహించనున్నట్లు సేవాలాల్ సేన యువజన సంఘం అధ్యక్షుడు సురేష్ నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్ వల్లూరు క్రాంతి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డిలు హాజరవుతారని పేర్కొన్నారు. సేవాలాల్ సంఘం నాయకులు, ఉద్యోగ, విద్యార్థి, యువజన సంఘాలు, యువకులు, గిరిజన ప్రజాప్రతినిధులు, గిరిజనులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలతోనే అభివృద్ధి

అయిజ: కేంద్ర ప్రభుత్వ పథకాలతో అన్ని వర్గాల వారికి లబ్ధి చేకూరుతుందని, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రగతిబాటలో నడుస్తున్నాయని జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని సంతబజార్ కాలనీలో శక్తి కేంద్ర కార్నర్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్, సుకన్య సమృద్ధి పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయం కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు మాధన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు భీమసేనరావు, పట్టణ ప్రధాన కార్యదర్శులు ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ దొంగకు రిమాండ్

గద్వాల క్రైం: ద్విచక్ర వాహనం అపహరించిన సంఘటనలో సోమవారం నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ ఎస్‌ఐ అబ్దుల్‌షుకుర్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం ఆదివారం రాత్రి పట్టణంలోని వేదనగర్‌కు చెందిన శ్రీరాం దుర్గప్రసాద్ తన ఇంటి ముందు బైక్ నిలిపాడు. ఇది గమనించిన వనపర్తి జిల్లా ఆత్మకూర్‌కు చెందిన రవి ద్విచక్రవాహనాన్ని చోరీ చేశాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో వాహనాల తనిఖీ చేస్తున్న క్రమంలో బైక్‌పై రవి వెళ్తూ సోమవారం పోలీసులకు పట్టుబడ్డాడు. బైక్ స్వాధీనం చేసుకుని నిందితుడిని గద్వాల కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు.

ఇరువురిపై కేసు నమోదు

శాంతినగర్: పొలం వద్ద జరిగిన వివాదంతో ఇరువురిపై కేసు నమోదైన సంఘటన శాంతినగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏ బూడిదపాడులో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు కథనం మేరకు ఏ బూడిదపాడు గ్రామానికి చెందిన మాల ఉరుకుందమ్మ తన పొలానికి వెళ్తోంది. అదే గ్రామానికి చెందిన వేముల శ్రీను అనే వ్యక్తి పొలం దగ్గర కులం పేరుతో ఆమెను దూషించి దాడి చేశాడు. అనంతరం మేముల శ్రీను, బాధితురాలు ఒకరికొకరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గద్వాల క్రైం: పాత కక్షలతో ఘర్షణకు పాల్పడిన ఇరువర్గాలపై కేసు నమోదు అయిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్‌ఐ ఆనంద్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని కృష్ణారెడ్డి బంగ్లా కాలనీ చెందిన ముగ్గురు వ్యక్తులు ఇటీవల అదే కాలనీకి చెందిన నరేష్‌పై దాడి చేశారు. ఈ విషయం గద్వాల మండలంలోని మెల్లచెర్వు గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలుడికి తెలవడంతో నరేష్‌పై దాడి చేసిన వ్యక్తులు బాలుడిని ప్రశ్నిస్తుండగా గ్రామస్తులు దొలు, కుర్వ రాములు వారితో గొడవకు దిగారు. మాట మాట పెరిగి ఇరువర్గాల వారు ఒకరికొకరు దాడి చేసుకున్నారు. ఇరువర్గాలకు చెందిన వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పనులు త్వరగా పూర్తి చేయండి

మదనాపురం: మండలంలోని అజ్జకొల్లు ప్రాథమిక పాఠశాలను సోమవారం జెడ్పీటీసీ కృష్ణయ్యయాదవ్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఆల సహకారంతో చేపట్టిన పనులను పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బ్రహ్మా మ్మ, పీఆర్ఏఈ నరేష్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాము, పంచాయతీ సెక్రెటరీ రవికుమార్, శాంతమూర్తి ఉన్నారు.

భక్తులతో ఆలయాలు కిటకిట



ధరూరులో ఆంజనేయస్వామి దర్శనం కోసం క్యూలో నిల్చున్న భక్తులు

రాజోళి: మండలంలో సోమవారం అమావాస్యను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. భ్రమరాంబ అడివేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని ఆంజనేయ స్వామి మందిరంలో స్వామి వారికి బిందె సేవ, ఆకు పూజ, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు భజనలు చేస్తూ, సంకీర్తనలు పాడుతూ స్వామి వారిని స్మరించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు.

ధరూరు: మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రధాన ఆలయాల్లో అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. సోమవారం మండలంలోని ఆంజనేయస్వామి ఆలయంతో పాటు పెద్ద చింతరేవుల అంజనేయస్వామి, అల్వాలపాడు, తెలుగోనిపల్లి, అంజనేయస్వామి, కోతులగద్ద అరణేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురంలో వెలసిన పాగుంటలక్ష్మి వేంకటేశ్వరస్వామి ఆలయం, మండల కేంద్రంలోని శివాలయంలో సోమవారం అమావాస్య పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి గీతాలతో స్వామివారికి పల్లకీసేవ నిర్వహించారు. అదేవిధంగా పాగుంట ఆలయంలో రథోత్సవం వైభవంగా కొనసాగింది. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని పలు ఆలయాలు సోమవారం అమావాస్యను పురస్కరించుకొని భక్తులతో రద్దీగా మారాయి. ఈ సందర్భంగా అభయాంనేయస్వామికి ఆలయ ప్రధాన అర్చకులు ఆకుపూజ, అభిషేకం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు ఉదయాన్నే బీచుపల్లి పుణ్యక్షేత్రానికి చేరుకొని పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో శివాలయం, కోదండరామస్వామి, సరస్వతీదేవితో పాటు అభయాంజనేయస్వామి ఆలయాలను దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఆంజనేయస్వామి ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.



బీచుపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయంలో..



కేటీదొడ్డిలోని పాగుంటలో..

కొనసాగుతున్న కంటి పరీక్షలు



కలుకుంట్లలో కంటి పరీక్షలను నిర్వహిస్తున్న డాక్టర్ యాకుబ్‌బాషా

అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీ పరిధిలో సోమవారం కొనసాగింది. అలంపూర్‌లోని జెడ్పీహెచ్ఎస్ న్యూప్లాట్స్ ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో 87 మంది పురుషులు, 70 మంది మహిళలు మొత్తం 157 మంది పరీక్షలు చేయించుకున్నారు. క్యాతూర్ పీహెచ్‌సీలోని లింగన్‌వాయిలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో 61 మంది పురుషులు, 63 మంది మహిళలు మొత్తం 124 మంది కంటి పరీక్షలు చేసుకున్నారు. కార్యక్రమంలో కంటి వెలుగు పర్యవేక్షణ అధికారి డాక్టర్ ప్రసూన రాణి, హెచ్ఏ బాలీశ్వరయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మానవపాడు: ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యుడు యాకుబ్‌బాషా అన్నారు. సోమవారం మండలంలోని కలుకుంట్లలో కంటివెలుగు కార్యక్రమంను సర్పంచ్ ఆత్మలింగారెడ్డి ఆయన ప్రారంభించారు. 145 మందికి పరీక్షలను నిర్వహించగా 28 మందికి అద్దాలు పంపిణీ చేశారు. 16 మందికిని అద్దాల కోసం రిఫర్ చేశారు. కార్యదర్శి సురేష్, పెద్ద బోజ్జన్న, వైద్య సిబ్బంది చంద్రన్న, సంధ్య, పుష్పలత, ప్రసన్న, శ్రావణి, లక్ష్మీనారాయణ, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

గట్టు: మండలంలోని రాయాపురం, మిట్టదొడ్డి గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమం కొనసాగింది. సోమవారం రెండు గ్రామాల్లో మొత్తం 289 మందికి కంటి పరీక్షలు చేశారు.

ధరూరు: మండల కేంద్రంలో కంటి వెలుగు శిబిరంతో పాటు నర్సరీని సోమవారం జెడ్పీసీఈఓ విజయనాయక్ సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జబ్బార్, ఏఎన్ఎంలు ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించండి



రోడ్డు నిర్మాణం పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నర్సయ్య

అయిజ: బీటీ రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య కాంట్రాక్టర్‌లను ఆదేశించారు. పట్టణంలోని పాతబస్టాండ్ నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. పట్టణంలో నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం, రోడ్డు డివైడర్, సెంటర్ లైటింగ్ సిస్టం పనులు వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పనులు సకాలంలో పూర్తిచేసి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో ఏఈ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పనిలో పెట్టుకోవద్దు

మల్దకల్: బడిఈడు పిల్లలను పనిలో పెట్టుకోవద్దని ఎస్సై శేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లో చైల్డ్ వెల్ఫేర్ సభ్యులతో కలిసి ఆయన పనులు చేస్తున్న బాలకార్మికులను గుర్తించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అలాగే బాల్యవివాహాల కలిగే అనర్థాలను వివరించారు. గ్రామాల్లో మహిళల రక్షణ కోసం హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎవరైన లైంగికంగా వేధిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్టేడియం నిర్మాణ పనుల పరిశీలన

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని పియదర్శిని జూరాల ప్రాజెక్ట్ క్యాంప్‌లో స్టేడియం కోసం చేపడుతున్న నిర్మాణాల పనులను సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కృషితో పట్టణ అభివృద్ధిలో భాగంగా క్యాంప్‌లో 10 ఎకరాల భూమి కేటాయించి స్టేడియం, స్విమ్మింగ్ పూల్, జిమ్ వంటి నిర్మాణాలకు పాత భవనాలు కూల్చివేశారని తెలిపారు. కార్యక్రమంలో కర్రెస్వామి, సాయినాథ్‌లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషి



మాట్లాడుతున్న పటేల్ ప్రభాకర్‌రెడ్డి

మల్దకల్: కాంగ్రెస్ గెలుపునకు కృషి చేస్తానని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో‌లో భాగంగా సోమవారం మండలంలోని మేకలసోంపల్లి, దాసర్‌పల్లి గ్రామాలలో ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌లకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. అలాగే ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు గ్రామాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శంకర్, నారాయణరెడ్డి, షేక్‌జమాల్, ఇలియాస్, రాజేంద్ర, వెంకటేష్, రఘు, రవినాయుడు, మజీద్, కోటేష్‌గౌడ్, హాజీ, దేవన్న, వెంకటన్న, ప్రవీణ్, అలెగ్జాండర్, మైనుద్దీన్, మోషె, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు



పులికల్‌లో కబడీ పోటీల్లో తలపడుతున్న మహిళా క్రీడాకారులు

అయిజ: మండలంలోని సింధనూరులో మల్లిఖార్జున స్వామి ఆలయంలో, పులికల్ రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్సవాలు సోమవారం కొనసాగాయి. సింధనూరులో ఓపెన్ కబడ్డీ టోర్నమెంట్, చేతిరాళ్లు, గుబ్బల గుండ్లు, దొబ్బుడు గుండ్లు, ఇసుక సంచులు ఎత్తు పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అదేవిధంగా పులికల్ గ్రామంలో సోమవారం నిర్వహించిన అంతర్రాష్ట్ర స్థాయి మహిళ విభాగం కబడ్డీ పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన మొత్తం 10 జట్లు తలపడ్డాయి. ప్రథమ బహుమతి తమిళనాడు జట్టు రూ. 40,000లు, విజయవాడ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి రూ.30,000లు, తృతీయ బహుమతి రూ. 20,000ను బెంగుళూరు జట్టు గెలుచుకుంది. కార్యక్రమంలో గ్రామస్తులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రైతు సంబరాలు



బిజ్వారం బండలాగుడు పోటీల విజేతలకు బహుమతులను అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సత్యారెడ్డి

మల్దకల్ : మండలంలోని బిజ్వారంలో మహాశివ రాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం రెండో రోజు బండలాగుడు పోటీలను జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ రాజారెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా మహాశివ రాత్రి పర్వదినం సందర్భంగా రైతు సంబురాలు జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. వృషభరాజాల పోటీలు తిలకించేందుకు వివిధ గ్రామాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రైతు సంబరాల ప్రాంగణమంతా రైతులు, వృషభ రాజాల యజమానులతో కిక్కిరిసిపోయింది.

విజేతలు బహుమతులు ప్రదానం

వృషభరాజాల పోటీలో నిలిచిన విజేతలకు జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సత్యారెడ్డిలు బహుమతులు ప్రదానం చేశారు. కర్ణాటక రాష్ట్రం పెలాన్‌దొడ్డి చెందిన ఖాజాహుసేన్ వృషభరాజాలు 4412 ఫీట్ల దూరం బండను లాగి మొదటి స్థానంలో నిలిచింది. వనపర్తి జిల్లా పెద్దమారుర్ రమేష్‌నాయుడు వృషభరాజాలు 3378 ఫీట్ల దూరం బండను లాగి రెండో స్థానంలో, సింగవరంరానికి చెందిన హర్షిణి వృషభరాజాలు 2500 ఫీట్ల దూరం బండను లాగి మూడో స్థానంలో నిలిచాయి. నాలుగో స్థానంలో వనపర్తి జిల్లా మియ్యాపూర్ చెందిన లోకేష్‌నాయుడు వృషభరాజాలు, ఐదో స్థానంలో వనపర్తి జిల్లా , పెబ్బేరుకు చెందిన బాల్‌రాజ్ వృషభరాజాలు, గద్వాల జిల్లా, తారపురంకు చెందిన నర్సింహుల 6వ స్థానంలో నిలిచాయి. మొదటి బహుమతి రూ.40 వేలు, రెండో బహుమతి రూ.35లు, మూడో బహుమతి రూ.30 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, సర్పంచు లక్ష్మన్న, నాయకులు శ్రీనివాసరెడ్డి, తిమ్మారెడ్డి, రమేష్‌రెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానివ్వొద్దు



మిషన్ భగీరథ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

అయిజ: వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా మిషన్ భగీరథ పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, వైస్ చైర్మన్ మాల నరసింహులు కోరారు. సోమవారం పట్టణంలోని వివిధ కాలనీల్లో నిర్మాణ దశలో ఉన్న మిషన్ భగీరథ పనులను వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ముందుచూపుతో తాగునీటి ఎద్దడి రాకుండా చూసుకోవాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు గ్రామాలను సందర్శించి సమస్యలను తెలుసుకోవాలన్నారు. మిషన్ భగీరథ పనుల్లో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ గోపాల్, బీఆర్ఎస్ నాయకుడు మహబూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అడివేశ్వరస్వామి జాతర



నాగమయ్య కట్టకు రంగులు వేస్తున్న నిర్వాహకులు

రాజోళి: మండల కేంద్రంలో కొలువైన భ్రమరాంబ అడివేశ్వరస్వామి జాతర ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. జాతర ప్రాంగణంలో భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు నిర్వాహకులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా 22న రాత్రి రథోత్సవం నిర్వహిస్తునట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వివిధ అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆలయానికి, రథానికి రంగులు వేసి ముస్తాబు చేస్తున్నారు. జాతరలో దుకాణాల ఏర్పాటుకు స్థలాన్ని చదును చేసే పనుల్లో నిమగ్నం అయ్యారు. మూడు రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో ముందస్తుగా అన్నీ ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

కళాశాల ఏర్పాటు చేయాలని మంత్రికి వినతి



మంత్రి శ్రీనివాస్ గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సాధన సమితి సభ్యులు

రాజోళి: మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని కళాశాల సాధన సమితి ఆధ్వర్యంలో సోమవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను విజ్ఞప్తి చేశారు. మహబూబ్‌నగర్‌లోని మంత్రి నివాసంలో ఆయనను కలిసి కాలేజీ ఏర్పాటు, ఆవశ్యకతను సమితి సభ్యులు వివరించారు. కళాశాల లేకపోవడంతో పేద విద్యార్థులు చదువులకు దూరం అవుతున్నారని వివరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సాధన సమితి కన్వీనర్ ఈశ్వరయ్య, చంద్రగౌడ్, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

బీమా నిధులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న నిక్సన్

కొత్తకోట రూరల్: భవన నిర్మాణ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బీమా నిధులను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పెద్దమందడి మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నిక్సన్ మాట్లాడుతూ అసెంబ్లీలో ప్రకటించిన విధంగా మోటర్ సైకిల్స్‌ను భవన నిర్మాణ కార్మికులకు వెంటనే ఇవ్వాలని, ప్రమాద బీమా ప్రస్తుతం ఇస్తున్న రూ.6లక్షలను రూ.10లక్షలకు పెంచాలని, సహజ మరణం కింద ఇస్తున్న రూ.1లక్షను రూ.5లక్షలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. 2009 నుంచి నమోదు చేసుకున్న కార్మికుల కార్డులు రెన్యూవల్ చేయాలన్నారు. 1979 వలస కార్మికుల చట్టాన్ని 1996 నిర్మాణ కార్మికుల కేంద్ర చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. శ్రీనివాసులు, కృష్ణయ్య, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

స్వయంభు పరమేశ్వరస్వామి జాతర



దాసంగాలు సమర్పిస్తున్న భక్తులు

ఆత్మకూర్: పట్టణ శివారలోని చెరువులో వెలసిన స్వయంభు పరమేశ్వరస్వామి జాతర సోమవారం ప్రారంభమైంది. 21, 22, 23వ తేదీల్లో వరుసగా మూడు రోజుల పాటు రాత్రి 9గంటలకు తేరు మహోత్సవం కనులపండువగా జరుగనుంది. సోమవారం ఆలయ పూజారి కర్బసయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారికి దాసాంగాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పల్లకీ సేవ పట్టణ పురవీధుల గుండా సాగి ఆలయానికి చేరిన అనంతరం తేరుమహోత్సవాన్ని నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. చెరువులో నీటి ఉధృతి అధికంగా ఉన్న కారణంగా భక్తులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. స్థానిక మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు జాతరను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళ, బుధ, గురువారం రాత్రిల్లో మూడు రోజులపాటు ప్రత్యేక పూజలతోపాటు పల్లకీసేవ, రథోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. స్వామివారిని దర్శించుకొని తరించారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



తల్లులకు పాదాభివందనం చేస్తున్న విద్యార్థులు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రగతి విద్యానికేతన్ హైస్కూల్‌లో సోమవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ సవారన్న మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తును తల్లిదండ్రులు ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధి పర భాషల ఆవశ్యకత ఉన్నప్పటికి మాతృభాషలో విద్యాబోధన ద్వారానే చిన్నారుల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణంలో అలసత్వం వద్దు



మాట్లాడుతున్న కుతుబ్

అమరచింత: మండలంలోని కొంకన్‌వానిపల్లిలో వంతెన నిర్మాణ పనుల్లో అధికారులు అలసత్వం చూపుతున్నారని ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ కుతుబ్ అన్నారు. గతేడాది వంతెన నిర్మాణం కోసం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన అధికారులు ఇప్పటి వరకు పనులను ప్రారంభించక పోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వంతెన నిర్మించాలని పలు మార్లు విన్నవించినా.. వానకాలం తర్వాత నిర్మిస్తామని చెప్పిన అధికారులు చలికాలం పూర్తయిన నిర్మించడం లేదని ఆరోపించారు. కొంకన్‌వానిపల్లికి చెందిన రైతులు తమ పంటపొలాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారని, ఇక్కడి నుంచి చిన్నచింతకుంట మండల కేంద్రానికి రవాణా వ్యవస్థ ఉన్న వంతెన లేకపోవడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు వంతెన పనులు ప్రారంభించాలని, లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజు, మహేష్, అంజి, మరియప్ప, మహేష్, నరేష్ పాల్గొన్నారు.

నేడు మదర్సా వార్షికోత్సవం

ఆత్మకూర్: పట్టణంలోని మదర్సా ఇమాదుల్ ఉలూం (అరబ్బీ పాఠశాల) 22వ వార్షికోత్సవం మంగళవారం సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ హఫీజ్ జియాఉర్ రహ్మాన్, హెడ్ మాస్టర్ హాఫీస్ రఫియోద్దీన్ తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా ఇక్కడ దివ్యఖురాన్ పఠనం పూర్తి చేసిన విద్యార్థులకు సన్మానం నిర్వహిస్తారన్నారు. మహ్మద్ ప్రవక్త దివ్య సూక్తులను తెలంగాణ, ఆంధ్ర అరబ్బిక్ స్కూల్స్ అధ్యక్షుడు మౌలానా జమాలుర్ రహ్మాన్, మౌలానా అహ్మద్‌వమీజ్‌సాహేబ్, మౌలా నా జుబేర్‌అహ్మద్‌ఖాన్, ప్రముఖ మౌలానాలు, ప్రసంగీకులు దైవ సందేశమిస్తారని తెలిపారు.